# గ్రూప్-2లో ఇన్‌వాలిడ్‌కు కారణాలేంటి?

- 13 వేల మంది ఫలితాలు ఎందుకివ్వలే?
- గ్రూప్-1 హాల్‌టికెట్లు వేర్వేరు ఎందుకు?
- తెలుగు మీడియం వారికి అన్యాయం
- వారి అనుమానాలను నివృత్తి చేయాలి
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్
- శాసనమండలిలో లేవనెత్తాలని ఎమ్మెల్సీ కవితకు అభ్యర్థుల విజ్ఞప్తి
- మూల్యాంకనం సరిగా లేదని ఆరోపణ



నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): ఇటీవల విడుదలైన గ్రూప్-2 ఫలితాల్లో 13 వేల మంది అభ్యర్థులను ఇన్‌వాలిడ్‌గా ఎందుకు ప్రకటించారని, గ్రూప్-1 పరీక్షలు, ఫలితాలపై అభ్యర్థులు లేవనెత్తుతున్న పలు అనుమానాలను రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నివృత్తి చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. గ్రూప్-2లో ఆ 13 వేల మంది అభ్యర్థుల ఫలితాలను ఎందుకు వెల్లడించలేదో తేల్చాలని డిమాండ్ చేశారు. గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలల్లో అవకతవకల ఆరోపణల నేపథ్యంలో రాష్ట్రంలోని 11 యూనివర్సిటీలకు చెందిన విద్యార్థి ప్రతినిధులు ఆదివారం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను కలిశారు. గ్రూప్స్ పరీక్షలు, ఫలితాలకు సంబంధించిన వివిధ అంశాలపై ఆమెతో చర్చించారు. ఫలితాలపై ఉన్న పలు అనుమానాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని, శాసన మండలిలో ఈ అంశాలను లేవనెత్తాలని వారు ఆమెకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు. ట్రాన్స్‌లేషన్ సమస్య వల్ల ప్రొఫెసర్లు, డిగ్రీ కాలేజ్ లెక్చరర్లు సరిగా మూల్యాంకనం చేయలేకపోయారని, దాని ఫలితంగా మార్కుల్లో వ్యత్యాసాలు ఏర్పడ్డాయని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. గ్రూప్-1 పరీక్షల్లో ప్రిలిమ్స్‌కి ఒక హాల్‌టికెట్, మెయిన్స్‌కి మరో హాల్‌టికెట్ నంబరు కేటాయించడం వల్ల విద్యార్థులు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారని తెలిపారు. పేపర్ల మూల్యాంకనంలో తెలుగు మీడియం అభ్యర్థులకు అన్యాయం జరిగిందని విద్యార్థులు తన దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ సత్య, గౌతమ్, విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు డాక్టర్ ఎల్చాల దత్తాత్రేయ, బొడ్డుపల్లి లింగం, అశోక్‌యాదవ్, మంథని మధు, కేయూ నుంచి శరత్ గౌడ్, గ్రూప్-1 అభ్యర్థులు సింధు, అనూష, సత్యవతి, రవీందర్ రాథోడ్, క్రాంతికిరణ్ పాల్గొన్నారు.

## తెలంగాణ హిస్టరీ.. ఫ్యూచర్ కేసీఆర్

- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణ
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కలలోనూ కేసీఆర్‌నే కలవరిస్తున్నరు: కవిత

ఖలీల్‌వాడి, మార్చి 16: తెలంగాణ హిస్టరీ, ఫ్యూచర్ కేసీఆర్ అని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కొనియాడారు. సీఎం రేవంత్‌రెడ్డి తన కలలో కూడా కేసీఆర్‌నే కలవరిస్తున్నట్టున్నాడని, ఉదయం నుంచి రాత్రి వరకు కేసీఆర్ జపం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందుకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొని మాట్లాడారు. గౌరవం అనే విషయం మన ప్రవర్తనతోనే ఉంటుందని తెలిపారు. కేసీఆర్ మాట్లాడితే జనం టీవీల ముందు క్యూకడతారని, రేవంత్‌రెడ్డి మాట్లాడితే టీవీలు మ్యూట్ చేస్తున్నారని చెప్పారు. కేసీఆర్‌తో రేవంత్‌రెడ్డి ఎక్కడా సరితూగలేడని, భవిష్యత్తు మళ్లీ కేసీఆర్‌దేనని స్పష్టంచేశారు. రోజురోజుకూ కేసీఆర్‌కు ప్రజల్లో మరింత ఆదరణ పెరుగుతుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమాన్ని మరిచిపోయిందని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి సబ్బండ వర్గాలను పట్టించుకోకుండా నోటికి ఏదివస్తే అది మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రంజాన్ పండుగ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింలకు తోఫాలు ఎందుకివ్వడం లేదని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి అబద్ధాలు చెప్తే ఊరుకునేదిలేదని హెచ్చరించారు. బీఆర్ఎస్ హయాంలో రంజాన్ సందర్భంగా మసీదులకు రూ.లక్ష చొప్పున ఇచ్చారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. బీఆర్ఎస్ అంటేనే మత సామరస్యానికి ప్రతీక అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, అర్బన్, రూరల్ మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేశ్‌గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్, బీఆర్ఎస్ బోధన్ ఇన్‌చార్జి ఆయేషా ఫాతిమా, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, మాజీ మేయర్ నీతూ కిరణ్ పాల్గొన్నారు.



విద్యార్థి అఖిల్ ఆత్మహత్యాయత్నం ఘటనపై తోటి విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, పక్కన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

## కాంగ్రెస్ పాలనలో గురుకులాలు నిర్వీర్యం

- హబ్షీపూర్ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల సందర్శన
- విద్యార్థి ఆత్మహత్యాయత్నంపై కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆవేదన

దుబ్బాక, మార్చి 16 : కాంగ్రెస్ ప్రభుత్వంలో గురుకుల పాఠశాలలు నిర్వీర్యమయ్యాయని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం హబ్షీపూర్ మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో శనివారం అఖిల్ అనే విద్యార్థి ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించడం బాధేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం గురుకుల పాఠశాలను సందర్శించి తరగతి గదులు, డార్మెటరీ, బాత్‌రూమ్‌లను ఆయన పరిశీలించారు. 7వ తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. అఖిల్ ఆత్మహత్య యత్నానికి గల కారణాలు, గురుకులంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 15 నెలల్లో గురుకుల, వసతి గృహాలను పూర్తిగా నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. నిలోఫర్‌లో అఖిల్‌కు అందుతున్న వైద్యంపై సంబంధిత వైద్యులతో శనివారం నుంచి ఎప్పటికప్పుడు మాట్లాడి తెలుసుకుంటున్నట్టు తెలిపారు. ఈ ఘటనపై అసెంబ్లీలో ప్రశ్నిస్తానని పేర్కొన్నారు. హబ్షీపూర్ వసతిగృహం కారాగారంగా ఉందని సిబ్బందిపై మండిపడ్డారు.

This may be published in Newspapers and TV from the day following the last date for withdrawal of candidature and upto two days before the date of poll

**Format C-1**

(for candidate to publish in Newspapers, TV)

**Declaration about criminal cases**

(As per the judgment date 25th September, 2018, of the Hon'ble Supreme Court in WP (Civil) No. 536 of 2011 (Public Interest Foundation & Ors. Vs. Union of India & Anr.)

Name and address of candidate : **Dr. DASOJU SRAVAN KUMAR, Flat No. 906, Aditya Empress Heights, Shaikpet nala, Shaikpet, VTC Golconda, HYDERABAD-500008. TELANGANA.**

Name of Political Party : **BHARAT RASHTRA SAMITHI**

(Independent candidates should write " Independent " here)

Name of Election : **BIENNIAL ELECTION TO TELANGANA LEGISLATIVE COUNCIL-2025.**

*Name of Constituency : **BY THE MEMBERS OF LEGISLATIVE ASSEMBLY(MLAs)**

I **Dr. DASOJU SRAVAN KUMAR** (name of candidate), a candidate for the above mentioned election, declare for public information the following details about my criminal antecedents:

**(A)pending criminal cases**

| Sl. No. | Name of Court | Case No and dated | Status of cases(S) | Section(s) of Acts concerned and brief description of offence(s) |
|---|---|---|---|---|
| 1. | XVth ACMM Crimnal Court Complex at Nampally CC.No.10404 of 2023 | FIR NO. 304 of 2023 at Shainayath gunj Police Station | Pending | Sec.188 of IPC This is a Suo Motu Police case alleging that I was found along with the contesting candidate on 29th November 2023 at about 19.00 Hours at Sriram Colony, Begum Bazar, Hyderbad in violation of Model Code of Conduct during General Eelections-2023, Telangana. |

**(B) Details about cases of conviction for criminal offences**

| Sl. No. | Name of Court & date(S) of order(s) | Description of offence (s) & punishment imposed | Maximum Punishment Imposed |
|---|---|---|---|
| -- | -NA- | -NA- | -NA- |

*in the case of election to Council of States or election to Legislative Council by MLAs, mention the election concerned in place of name of constituency.

- సీఎం రేవంత్ దిష్టిబొమ్మ దహనం



సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ సమావేశాల నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం బీఆర్ఎస్ నాయకులు ఆందోళనకు దిగారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో జాతీయ రహదారిపై సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. - ఆలేరు టౌన్

## మీ చేతుల్లో పాలన పెట్టడమే కేసీఆర్ తప్పు!

- స్వరాష్ట్రాన్ని సుసంపన్నం చేయడం పొరపాటు
- బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి



హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): అవును.. తెలంగాణ కోసం పదవులను త్యాగం చేసి, స్వరాష్ట్ర సాధన కోసం పార్టీ పెట్టి, తెలంగాణ సాధించి కేసీఆర్ తప్పు చేశారని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ సాధన కోసం ఆయన చేయని తప్పులు లేవని కాంగ్రెస్‌కు కౌంటర్ వేశారు. ఈ మేరకు ఆదివారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'ఎక్కిన మెట్టు, దిగిన మెట్టు లేదన్నట్టు తెలంగాణ కోసం కాళ్లరిగేలా తిరిగి కేసీఆర్ తప్పు చేశారు. దేశంలోని అన్ని పార్టీలకు తెలంగాణ ఆవశ్యకతను చెప్పి, వారిని మెప్పించి తప్పు చేశారు. తెలంగాణ కోసం పోరుబాట పట్టి, వరంగల్ సభ, సకలజనుల సమ్మె, మిలియన్ మార్చ్, సాగరహారం నిర్వహించి, ప్రాణత్యాగానికి సిద్ధపడి తప్పు చేశారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి, తెలంగాణను సాధించడమే కేసీఆర్ చేసిన అతిపెద్ద తప్పు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణను దేశంలో అగ్రగామిగా నిలిపి, తలసరి ఆదాయాన్ని రూ.3.56 లక్షలకు పెంచి, జీఎస్డీపీని రూ.15 లక్షల కోట్లకు పెంచి, రూ.1 లక్ష కోట్ల బడ్జెట్‌ను రూ.2.7 లక్షల కోట్లకు పెంచి తప్పు చేశారు. కల్యాణలక్ష్మి, ఆసరా పింఛన్లు, రుణమాఫీ, 24 గంటల కరెంటు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, రైతుబంధు, రైతుబీమా, గురుకులాలు, టీహబ్, టీవర్క్స్, కాళేశ్వరం, సీతారామ, దేవాదుల నిర్మాణం, బస్తీ దవాఖానలు, కేసీఆర్ కిట్, కంటి వెలుగు తదితర పథకాలు, హరితహారం లాంటి కార్యక్రమాలు చేపట్టడమే కేసీఆర్ చేసిన తప్పు. చేతకాని వారి చేతుల్లో పాలన పెట్టి.. రోజూ తిట్టించుకోవడమే ఆయన చేసిన అసలుసిసలు తప్పు' అని కాంగ్రెస్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధించారు.



## కేసీఆర్‌ని దూషించడం సరికాదు

సీఎం రేవంత్ వ్యాఖ్యలను ఖండించిన మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ని దూషిస్తూ.. ఆయనపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు ఖండిస్తున్నట్టు మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. కేసీఆర్‌ను దూషించడాన్ని ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని ఆయన కోరారు. సీఎంగా ఉన్న సమయంలో సాగునీరు, తాగునీరు అందించడంతోపాటు 24గంటల విద్యుత్తు అందించిన కేసీఆర్‌ను దూషిస్తే ప్రజలు సహించరని హెచ్చరించారు. సబ్బండవర్గాలకు సంక్షేమ ఫలాలు అందించిన ఆయనపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడాన్ని శశిధర్‌రెడ్డి తప్పుబట్టారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి కేసీఆర్‌కు క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్‌చేశారు.

## ఓయూలో ఆందోళనలపై నిషేధం ఎత్తివేయాలి

- శాంతియుత వాతావరణం కల్పించాలి
- లేదంటే విద్యార్థుల తరపున పోరాడుతాం
- బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగబాలు



హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థుల ఆందోళనలపై నిషేధం విధిస్తూ జారీచేసిన ఉత్తర్వులను ఎత్తివేయాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇది విద్యార్థుల ప్రజాస్వామ్య హక్కులను హరించడమే అవుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఓయూలో శాంతియుత వాతావరణం ఉండేలా ఓయూ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా ఉద్యమాల, రాజకీయ ఆలోచనల సంఘర్షణల కేంద్ర బిందువైన ఓయూలో వీసీ తీసుకొచ్చిన ఈ నిర్ణయం ప్రజాపాలనలో భాగమేనా? అని ప్రశ్నించారు. వర్సిటీలో నిర్బంధ పాలనకు తెరలేపారని విమర్శించారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఓయూ విద్యార్థులు రోడ్డెక్కకుండా అల్టిమేటం జారీ చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు. విద్యార్థుల ఉద్యమాలపై ఉక్కుపాదం మోపాలనే దుర్మార్గమైన ఆలోచనలను మానుకొని, వారి హక్కులను కాపాడాలని కోరారు. లేకుంటే సమస్యల పరిష్కారం కోసం విద్యార్థుల తరపున బీఆర్ఎస్వీ పోరాడుతుందని స్పష్టంచేశారు.

### నిషేధాజ్ఞలు ఎత్తివేయాలి: పడాల

ఉస్మానియా యునివర్సిటీలో విద్యార్థి ఉద్యమాలపై తీసుకొచ్చిన నిషేధాజ్ఞలను ఎత్తివేయాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల సతీశ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆందోళనలే చేయవద్దని పాలకవర్గం ఆదేశాలు ఇవ్వడం తెలంగాణ ఉద్యమాన్ని అవమాన పరచడమేనని పేర్కొన్నారు. నిషేధాజ్ఞలను ఎత్తివేయకుంటే వర్సిటీ అగ్నిగుండంగా మారుతదని హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమానికి గుండెకాయ వంటి ఉస్మానియాలో నిషేధాజ్ఞలు విధిస్తే ప్రొఫెసర్ కోదండరాం ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు.

## నిరసనల నిషేధం నియంతృత్వం

- ఓయూ వీసీ విడుదల చేసిన సర్క్యులర్ వెనక్కి తీసుకోవాలి
- అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ డిమాండ్

హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆవరణలో ఎలాంటి నిరసనలు, ధర్నాలు నిర్వహించరాదని ఉపకులపతి, రిజిస్ట్రార్ విడుదల చేసిన సర్క్యులర్‌ని వెంటనే వెనక్కు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఆదివారం జరిగిన ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్‌లు మాట్లాడుతూ.. వంద సంవత్సరాల చరిత్ర కలిగిన ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎన్నో పోరాటాలు, త్యాగాలకు చిహ్నమని అన్నారు. తెలంగాణ ఉద్యమంతో ఎంతోమంది వీరులను సమాజానికి పరిచయం చేసిన నేల అని పేర్కొన్నారు. అటువంటి నేలపై నియంతృత్వ వైఖరితో ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే విధంగా నిరసనలు, ధర్నాలు నిర్వహించరాదని ఆదేశాలు జారీ చేయడం వారి నియంతపోకడకు నిదర్శనమని విమర్శించారు. విద్యార్థి ఉద్యమాలను అణచాలని చూస్తే విద్యార్థుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాసేలా ఇచ్చిన ఆదేశాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు.


